TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Tel.No. 040-64524554 Fax: 040-27635644
Mobile: 9030626288 E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

# పోరాటానికి మరో పేరు భూమయ్య

**హైదరాబాద్, డిసెంబర్ 28:**

పోరాటానికి మరో రూపం ఆకుల భూమయ్య అని టీపీఎఫ్ ఈసీ సభ్యుడు ఎ.నర్సింహారెడ్డి అన్నారు. శనివారం నాడిక్కడ తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో 'ఆకుల భూమయ్య స్మృతిలో – ప్రజాస్వామ్య తెలంగాణ – ముసాయిదా బిల్లు' అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ఆకుల భూమయ్య వివిధ పోరాటాలలో పాల్గొన్న తీరుతెన్నులను వివరించారు. ప్రత్యేక తెలంగాణ పోరాటంలో ఎంతో చురుగ్గా పాల్గొన్నారని పేర్కొన్నారు. వేతనాల పెంపుదల లాంటి అంశాలపై గాకుండా ప్రజల సమస్యలపై ఉపాధ్యాయులు ఉద్యమించాలని భూమయ్య సూచించారని, ఉపాధ్యాయ సంఘాలు ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూడా ఉద్యమించేలా చేశారని అన్నారు.

మండల్ కమిషన్ నివేదికను సమర్థించారని పేర్కొన్నారు. వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా భూమయ్య పోరాడారని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో స్పెషల్ టీచర్ల విధానాన్ని వ్యతిరేకించారన్నారు. సమస్యను గుర్తించడం, పోరాటాన్ని ప్రారంభించడం, పోరాట రూపాలను ఎంచుకోవడం, వాటిని ఫలితం సాధించే దాకా కొనసాగించడం భూమయ్యకు అలవాటని పేర్కొన్నారు. వైరుధ్యాలు ఉన్నప్పటికీ కలిసికట్టుగా పోరాటాన్ని ముందుకు నడిపించే తత్వం ఆయనదని తెలిపారు.

తెలంగాణకు మద్దతుగా ఎదుటి పక్షం వాదనలను తిప్పిగొట్టడంలో దిట్టగా నడుస్తున్న తెలంగాణ ఎడిటర్ డాక్టర్ కాశీం అభివర్ణించారు. ఆయనెప్పుడూ తప్పుడు విధానాలను నమ్మలేదని, నమ్మిన వాటిని తుదివరకూ కొనసాగించారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ప్రారంభమైన ఉద్యమ తీరుతెన్నులను వివరించారు. వివిధ పోరాటాల్లో ఆయనకు తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. భూమయ్య వ్యక్తిత్వం మహోన్నతమైందని అన్నారు. రాజీపడే ధోరణి ఆయనలో లేదన్నారు. తెలంగాణ జనసభపై నిర్బంధాన్ని ఎలా ఎదుర్కొన్నారో తెలిపారు. ఉద్యమాల్లో ఎంతగా కొనసాగినప్పటికీ, వృత్తి నిబద్ధతను ఏనాడూ వదులుకోలేదని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, డాక్టర్ జి. లచ్చయ్య తదితరులు ఈ సందర్భంగా ప్రసంగించారు. టీఆర్సీ చైర్మన్ ఎం.వేదకుమార్, ఎంపీఎఫ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి, టీపీఎఫ్ నాయకులు నలమాస కృష్ణ, చిక్కుడు ప్రభాకర్, పీకేఎం కోటి, దేవేంద్ర, మునీర్ ముజాహిద్దీన్, సనా ఉల్లా, రిటైర్డ్ ఇంజినీర్ల ఫోరమ్ ప్రతినిధి లక్ష్మీనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీఆర్సీ కో–ఆర్డినేటర్